నూరేళ్ళ తెలుగు కథకు నవ్య నీరాజనం - 88



# మనసును కదిలించేది మంచి కథ... పాఠకుణ్ణి తనవెంట నడిపించేది మంచి కథనం...!

## - జీడిగుంట రామచంద్రమూర్తి

**ఆయన కథల్లోని పాత్రలు మానవతా మూర్తులు... ఆయన కథల్లోని వర్ణనలు తెలుగింటి అద్భుత రూపురేఖా విలాసాలను పొదువుకున్న రమ్యాక్షర సమూహాలు...! కలం పట్టి, తొలి కథను సృష్టించేసి ఇప్పటికి ఏభై వసంతాలు పూర్తయినా-తమ రచనల్లో నేటికీ అచ్చమైన, అనుభూతిమయమైన తెలుగు భావుకతను చెక్కుచెదరకుండా కాపాడుకుంటూ వస్తున్న 'సాహితీ స్వర్ణోత్సవ కథకుడు' జీడిగుంట రామచంద్రమూర్తితో ఈ వారం ఇంటర్వ్యూ....**

పైరు పచ్చలకు నిలయమైన పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలులో-రామకృష్ణారావు, వెంకట నర్సమ్మ దంపతులకు పెద్ద కొడుకుగా పుట్టాను.. 'లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల' పేర్లు పెట్టకపోయినా నాకున్నది ముగ్గురు తమ్ముళ్లు..... 'శాంత 'లాంటి ఓ చెల్లెలూ వుంది......! ఏ ఉద్దేశ్యంతో వాళ్లు, నాకు 'రామచంద్రమూర్తి' అని నామకరణం చేశారో తెలీదు కానీ- ఆ పేరులో ఏదో 'పవరు'ందని మాత్రం- కొంత వయసొచ్చాక తెలిసింది!.... నాకు శ్రీరాముడంటే ప్రాణం....అలాంటి అద్భుతమైన పేరు నాకు పెట్టిన అమ్మా-నాన్నలకు నమస్కరిస్తూంటాను!

### మనసుకిష్టమైన ఆకాశవాణి ఉద్యోగం

మా నాన్నగారు డాక్టరు కావటం వల్ల-నన్నూ డాక్టర్ని చేయాలనుకున్నారు...


ఎస్.ఎస్.ఎల్.సి అయ్యాక-ఏలూరు సి.ఆర్.ఆర్. కాలేజీలో, ఇంటర్‌లో చేర్పించారు... బైపీసీ మూడు సబ్జెక్టుల్లో ఫెయిలయ్యాను... అక్కడితో కాలేజీ చదువుకి తెరపడింది... తర్వాత 1959లో-వరంగల్లు కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో, టైపిస్టు ఉద్యోగం సంపాదించుకున్నాను....

1961లో విద్యాశాఖలో పర్మనెంటు ఉద్యోగం వచ్చింది. దాంతో 1962లో మకాం కాకినాడకు మారింది.. అక్కడే ఇంటరు, బి.ఎ.పరీక్షలు రాసి ప్యాసయ్యాను... ఉద్యోగానికి శలవు పెట్టి, రాజమండ్రిలో బి.ఇడి. ట్రైనింగ్ పూర్తి చేశాను... తర్వాత హైదరాబాద్ ఆకాశవాణిలో- 'కాంట్రాక్టు' పద్ధతిపై 'స్క్రిప్టు రైటరు' ఉద్యోగంలో చేరాను. మనసుకు నచ్చిన ఉద్యోగమది. ఎందరో సాహితీవేత్తలకు నిలయం. దాశరధిగారు, రజనీకాంతరావుగారూ, దివాకర్లవారూ ఆనాడు నన్ను ఇంటర్వ్యూలో ఈ ఉద్యోగానికి ఎంపిక చేశారు. ఆ విధంగా 1971లో మా మకాం హైదరాబాదుకు మారింది.

ఎక్కడో ఓ మారుమూల గ్రామం నుంచి వచ్చి ఆకాశవాణిలో ఎంతో మంది మహనీయుల మధ్య కూర్చోగలిగానంటే- అది పూర్వజన్మ సుకృతం..అమ్మ ఆశీర్వాదం.... కవులు, పండితులు, రచయితలు, గాయనీ గాయకులు, నటీనటులు, రాజకీయ నాయకులు-ఇలా ఎంతో మంది మహానుభావుల పరిచయ భాగ్యాన్ని కలిగించింది ఆకాశవాణి ఉద్యోగం...!

### రచనా వ్యాసంగం.....

నేను హైస్కూల్లో చదివే రోజుల్లోనే-'విజయాంధ్ర' పేరుతో-నాలుగైదు నెలలు ఓ లిఖిత పత్రికను నిర్వహించాను... ఆ పత్రికా నిర్వహణే, తర్వాత రోజుల్లో రచనా వ్యాసంగంపట్ల నన్ను ఆకర్షితుణ్ణి చేసింది... చిన్న చిన్న కథలు రాసి పత్రికలకు పంపేవాడిని... అన్నీ తిరుగు టపాలో వచ్చేసినా పట్టువద




ల్లేదు... పట్టు సాధించాను.... 1960 నవంబరులో, ఆంధ్రపత్రికవారు నేను రాసిన 'హంసగమన' కథను 'మధ్యపేజీ కథ'గా ప్రచురించారు... పైగా దానికి 'బాపు' గారి బొమ్మ!.....

జీవితం ధన్యమైందనుకున్నాను... కథలు రాయగలనన్న ధైర్యం ఏర్పడిపోయింది... ఆ కథకు 'పది హేను రూపాయల' పారితోషికం వచ్చింది.

'హంసగమన' కథతో ప్రారంభమైన నా రచనా వ్యాసంగం అనేక రకాలుగా విస్తరించుకుంటూ నేటికీ కొనసాగుతూనే వుంది!... ఇప్పటిదాకా సుమారు మూడు వందల కథలు రాశాను.. వాటిలో నాలుగైదు కథలు బహుమతుల్ని పొందాయి... పది కథలు కన్నడంలోకి మరో పది కథలు ఇంగ్లీషులోకీ, నాలుగు కథలు హిందీలోకీ అనువాదాలయ్యాయి.... అవికాక ఎనిమిది నవలలూ, రెండు నాటకాలూ ప్రచురితమయ్యాయి.. ఏర్చికూర్చిన నా కథలు అయిదు సంపుటాలుగా విడుదలయ్యాయి.

ముఖ్యంగా రేడియో ఉద్యోగంలో వుంటూ చాలా రాశాను. హరికథ, బుర్రకథ తప్ప తెలుగు సాహిత్యంలోని ప్రధాన రచనా ప్రక్రియలన్నింటిలోనూ రాశాను... వ్యాసాలు, కథలు, కవితలు, కబుర్లు, ప్రసంగాలు, పాటలు, నాటకాలు, డాక్యుమెంటరీ రూపకాలు-ఇంకా చెప్పాలంటే వ్యాపార ప్రకటనలు, సూక్తులు-అలా ఎన్నెన్నో రాశాను...'నవలా స్రవంతి' కార్యక్రమం ద్వారా ప్రముఖ రచయితల నవలల్నీ, కథల్నీ-శ్రోతలకు చదివి వినిపించాను... 1975-85 మధ్యకాలంలో చాలా సినిమాల్ని-గంట వ్యవధికి కుదించి-సంక్షిప్త శబ్ద చిత్రాలుగా ప్రసారం చేశాను. 'మాటల కెరటాలు' శీర్షికన-ప్రముఖులతో పరిచయాల్ని వినిపించాను.

## నాకు నచ్చినవి....

| | | |
|---|---|---|
| కవి | : | డాక్టర్ సి.నారాయణరెడ్డి |
| రచయితలు | : | ఆదివిష్ణు,యండమూరి వీరేంద్రనాథ్ |
| కథ | : | ''అతనికరాడు''-కొనకళ్ళ వెంకటరత్నం |
| నవల | : | వెన్నెల్లో ఆడపిల్ల (యండమూరి) |
| సినిమా | : | దేవదాసు |
| గాయని | : | పి.సుశీల |
| గాయకుడు | : | ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం |
| సంగీత దర్శకుడు | : | ఇళయరాజా |
| గీత రచయిత | : | వేటూరి, సిరివెన్నెల |
| వంటకం | : | శ్రీమతి చేసే గుత్తివంకాయ కారం పెట్టి చేసే కూర |
| తీరిక వేళల్లో | : | పాటలు వినటం..... కథలు రాయటం |

### రేడియో బాలయ్య....

ఆకాశవాణి ప్రసారం చేసిన కార్యక్రమాల్లో-ఆదివారం నాటి 'కార్మికుల కార్యక్రమా'నికి, గొప్ప 'ఫాలోయింగ్' వుండేది!... చిన్నక్క, ఏకాంబరాలతోపాటు,అప్పట్లో డి.వెంకట్రామయ్యగారు 'రాంబాబు'గా పాల్గొంటూ, ఆ కార్యక్రమ రచన చేస్తూ దానికో ప్రత్యేకతను తీసుకొచ్చారు. 1975 ప్రాంతంలో, ఆ కార్యక్రమ నిర్వహణ బాధ్యత నాకు అప్పగించారు... దానికి రచన చేస్తూ, 'బాలయ్య'గా పాల్గొనేవాణ్ణి!... ఇప్పటికీ శ్రోతలు ఆ కార్యక్రమాన్నీ, మా పాత్రల్నీ గుర్తు చేస్తుంటారు...

### రేడియో నాటికలు,నాటకాలు

నాకు కథలు రాయటమన్నా-రాసేముందు ఆ కథల్ని మిత్రులకు చెప్పటమన్నా-చాలా ఇష్టం...! అలాగే కొన్ని కథల్ని రేడియోకి నాటికలుగా అనుసరించాను... రంగస్థలానికీ, సినిమా టీవీలకు రాయటం కంటే రేడియోకి నాటకం రాయటమే కష్టమని నా అభిప్రాయం.....సాధనవల్ల అది నాకు ఇష్టంగా మారిపోయింది..ప్రముఖ రచయితల నవలల్ని-రేడియో నాటకాలుగా రాసి ప్రసారం చేశాను.

### పురస్కారాలు

'అమూల్యం' పేరుతో వచ్చిన నా కథల సంపుటికి రెండువేల సంవత్సరంలో, 'అశ్రు ఘోష' పేరుతో ప్రచురితమైన నాటకానికి 2002 లోనూ తెలుగు విశ్వవిద్యాలయం వారి సాహితీ పురస్కారాలు లభించాయి... దూరదర్శన్‌లో ప్రసారమైన-నా రచనలకు మూడు సార్లు 'నంది' పురస్కారాలు అందుకున్నాను... నాటి గురజాడ అప్పారావుగారి నించి,మధురాంతకం రాజారావుగారి వరకూ-నేను రాసిన అనేక ప్రముఖ రచయితల కథలు 'లఘు చిత్రాలు'గా దూరదర్శన్‌లో ప్రసారమయ్యాయి.

2008లో 'రసమయి సంస్థ' రంగస్థల పురస్కారం, 'ఆరాధన సంస్థ' కళాకౌశల పురస్కారం, 'ఢిల్లీ తెలుగు అకాడమీ'ఉగాది పురస్కారాలను అందుకున్నాను....

### కుటుంబం

మాకు ముగ్గురు అబ్బాయిలు. పెద్దబ్బాయి విజయ సారథి పదహారేళ్ళు అమెరికాలో ఉద్యోగం చేసి-వాళ్ళబ్బాయి 'వరుణ్ సందేశ్' ఇక్కడ 'హీరో'గా సినిమాల్లో స్థిరపడిన కారణం చేత-హైదరాబాదుకి మకాం మార్చేశాడు... రెండో అబ్బాయి శ్రీధర్ ఆంధ్రాబ్యాంకు ఉద్యోగం-తీరిక సమయాల్లో 'టీవీ సీరియల్స్'లో నటిస్తుంటాడు...చిన్నబ్బాయి వేణుగోపాల్ 'న్యూజెర్సీ'లో 'సాఫ్ట్‌వేర్ ఇంజనీరు'.

### తృప్తి -ప్రాప్తం....

సంతృప్తిని మించిన సంపద లేదని నా నమ్మకం! లేనిదానికోసం పరుగులు తీసి-మనశ్శాంతిని దూరం చేసుకోవటం కంటే-ఉన్నదీ, వచ్చినదే ఉన్నతమనుకోవటం ఉత్కృష్ట లక్షణమని నమ్మే వాళ్ళలో నేనూ ఒకణ్ణి!...ఉన్నంతకాలం ఆరోగ్యంగా వుండేలా చూడమని మాత్రమే దేవుణ్ణి ప్రార్థిస్తుంటాను. ఆ పైన ప్రాప్తం... అంతే!... అంతవరకూ 'తిరిగే కాలూ తిట్టే నోరూ ఊరుకోవన్నట్టుగా'-'రాసే చెయ్యి కూడా ఊరుకో'కూడదనుకుంటూ-మనసు స్పందించినపుడల్లా రాస్తూనే వుంటాను!!...

**-జె.చెన్నయ్య**




జీ.రా. సప్తతి, సాహితీ స్వర్ణోత్సవం సందర్భంగా జంటనగరాల్లోని కొన్ని సాహితీ సాంస్కృతిక సంస్థలు జీడిగుంట దంపతుల్ని సన్మానిస్తున్న సందర్భంగా...

నాకు నచ్చిన నా కథ

# గోదానం

- జీడిగుంట రామచంద్రమూర్తి

**జ**నవరి నాలుగో తేదీ...

రాత్రి ఎనిమిది గంటల వేళ...!

అమెరికా దేశంలోని హ్యూస్టన్ నగరపు 'డౌన్‌టౌన్'కి సమీపంలో వరుసగా ఎన్నో బంగళాలు...

వాటిలో అత్యంత అధునాతనంగా, ముందు పచ్చని లాన్‌తో - ఎంతో అందంగా కనిపిస్తున్న ఓ విశాలమైన బంగళా ముందు గ్రేకలర్ డాటన్స్ కారొచ్చి ఆగింది!

తెల్లసఫారిలో హుందాగా కనిపిస్తున్న డాక్టర్ సుందరం కారు దిగి, బ్రీఫ్ చేత్తో పుచ్చుకుని గుమ్మం దగ్గర కొచ్చి బజర్ నొక్కాడు. వెంటనే తలుపు తెరచుకుంది....

ఎదురుగా కనిపించిన నాలుగేళ్ళ పీలూ 'హాయ్‌డాడ్' అంటూ నవ్వుతూ పలకరించింది.

''హలో బేబీ''! - అంటూ ఆమె బుగ్గ చిదిమి - ముద్దుపెట్టుకుని లోపలకు నడిచాడు సుందరం.

''ఎనీ లెటర్స్''? - బట్టలు మార్చుకుంటూ అడిగాడు.

''యా!'' - చటుక్కున గుర్తుకొచ్చిన దానిలా వెళ్ళి - టీవీ కేబినెట్ మీద వున్న ఓ కవరు తెచ్చి తండ్రికి అందించింది పీలూ.

''ఎక్కణ్ణించి?'' - సుందరం ఉత్తరం చదువుతూంటే - డైనింగ్ టేబుల్ మీద డిన్నర్ రెడీ చేస్తూ అడిగింది రమ్య.

''మా నాన్న రాశాడు!''

''ఏవంటారు?''

''ఏముందీ... పాతపాటే!.... చదువుతా... విను!.... నాన్నా.... సుందరం... క్రితం సారి నేనురాసిన ఉత్తరానికి జవాబు రాయలేదు... మీ అమ్మ నీకోసం బెంగ పెట్టేసుకుంది! రాత్రిళ్లు కలలోకి వస్తున్నావట... నిన్ను చూడాలని తపించిపోతోంది... సంక్రాంతి పండక్కి కోడల్నీ పాపనీ తీసుకు రావల్సిందిగా మరీ మరీ రాయమంది... ఎలాగో అలా తీరిక చేసుకుని వస్తావ్‌కదూ?....''

సుందరం - ఉత్తరాన్ని చదవటం ముగించి, దాన్ని టేబుల్ మీదకు విసిరేసి - డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాడు.

''పోనీ ఓసారి వెళ్ళిరాకూడదు?''

ఆ ప్రశ్న విని భార్య వైపు వింతగా చూశాడు.

''ఏముందక్కడ?.... మురికి రోడ్లూ, ఇరుకు సందులూ.... అంతేగా?''

''వాటితో మీకేం పని? మావయ్యగార్నీ, అత్త గార్నీ చూసి వచ్చేయచ్చు... పెద్దవాళ్ళు... ఆపై కన్న వాళ్లు... పైగా మావయ్య గారు ఈ మధ్య రిటైరై పోయారు కూడానూ! ఒక్కసారి మీరు ఎదురుగా కనిపిస్తే వాళ్ళకి తృప్తిగా వుంటుంది?'' - ప్లేటులో భోజనం వడ్డిస్తూ చెప్పింది రమ్య.

''నీకు తెలీదు రమ్యా... అక్కడికి వెళ్ళిన దగ్గర్నుంచీ వాళ్ళు నా బ్రెయిన్ తినేస్తారు....!'' హాయిగా ఇక్కడే ప్రాక్టీసు పెట్టుకో! వచ్చినంతే వస్తుందీ... మనకి పదెకరాల మాగాణీ వుందీ.... బోలెడంత పంట వస్తుందీ!' అంటూ రికార్డు పెడతారు... అయ్ హేట్ దెయిర్ మెంటాలిటీ'' - సుందరం విసుక్కున్నాడు.

రమ్య మరి మాట్లాడలేదు.

***

జనవరి పన్నెండో తేదీ.... ఉదయం పదకొండు గంటల వేళ!....

ఏలూరు పవర్‌పేటలో పార్వతీభవనం ముందు సైకిలు దిగేడు పోస్టుమేన్.

వసారాలో వీధి గుమ్మానికి ఎదురుగా వాలుకుర్చీలో కూర్చుని పేపరు చదువుతున్న శివరామయ్య, ఎదురుగా వస్తున్న పోస్టుమాన్‌ని చూసి, ఉత్సాహంగా అడిగాడు.

''ఉత్తరం ఏమన్నా వచ్చిందా?'' అని

''వచ్చింది సార్!'' - అంటూ చేతిలో వున్న కట్టలోంచి ఓ పొడుగుపాటి కవరులాగి శివరామయ్య చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు పోస్టుమాన్.

ఆ కవర్ని చూడగానే శివరామయ్యకు వెయ్యేనుగుల బలం వచ్చింది.

''ఏమోయ్! అబ్బాయి ఉత్తరం రాశాడోయ్!'' కవరు చింపుతూ లోపలకు కేక పెట్టాడు.

''రాశాడా! - నాకు తెలుసు రాస్తాడని!.... ఏం రాశాడూ?.... మన ఉత్తరం అందిందటా? ఇంతకీ కోడల్నీ మనవరాల్నీ పండక్కి తీసుకొస్తున్నాడా లేదా?'' - ప్రశ్నల వర్షం కురిపిస్తూనే వంటింట్లోంచి వసారాలోకి వచ్చింది పార్వతమ్మ.

అప్పటికి ఉత్తరం చదవటం పూర్తిచేసిన శివరామయ్య నిరాశగా నిట్టూర్చాడు.

''ఏం రాశాడండీ? రావటం కుదరదన్నాడా?'' - భర్త మనోభావాల్ని చదవటానికి ప్రయత్నిస్తూ బెరుకుగా అడిగింది మళ్లీ.

''చాలా బిజీగా వున్నాట్ట పార్వతీ! తాను వస్తే హాస్పటల్లో పేషంట్లు సఫరవుతారట... మరోసారి ఎప్పుడైనా వీలుచేసుకుని వస్తాడట. మనకి పండగ శుభాకాంక్షలు తెలియచేశాడు... అంతే!''

ఆ మాటలంటూంటే శివరామయ్య కళ్లు చెమ్మగిల్లాయి....

''బోడి శుభాకాంక్షలు ఎవరికి కావాలండీ?.... వాటితో మనసు తీరిపోతుందా?.... అయినా ఎప్పుడో వీలుచేసుకుని వచ్చే బదులు - ఆ వీలు ఇప్పుడే చేసుకోవచ్చుగా?..... మనల్ని వదిలి వెళ్లి అప్పుడే అయిదేళ్లు కావస్తోంది... ఈలోగా మనల్ని

చూడాలని ఒక్కసారి కూడా వాడికి అనిపించలేదా? అసలు మనం బతికుండగా వాడికి తీరుబడి దొరుకుతుందో లేదో?'' ... పార్వతమ్మ గొంతు కూడా గాద్గదికమైంది.

''కడుపు తీపి నీ చేత అలా అనిపిస్తోంది... అంతే! - అక్కడ పరిస్థితులు ఏమిటో - వాడి ఇబ్బందులు ఎలాంటివో నీకూ నాకూ ఏం తెలుస్తాయి చెప్పు?'' తనకు తాను సమాధాన పరుచుకునే ధోరణిలో - భార్యను ఓదారుస్తున్నట్టుగా అన్నాడు శివరామయ్య.

''ఎరక్కపోయి వాడిచేత ఆ డాక్టరీ చదివించామండీ! లేకపోతే హాయిగా ఇంటి పట్టునే వుండి ఆ పొలం పుట్రా చూసుకునే వాడు.. ఈ వయసులో మనకింత ఆసరాగా నిలిచేవాడు!'' అనుకుంటూ వంట గదివైపు వెళ్ళబోయిన పార్వతమ్మ 'అమ్మగోరూ' - అన్న పిలుపు విని ఆగి పోయింది.

వీధి గుమ్మం దగ్గర కిష్టిగాడు నిలబడి వున్నాడు.

''ఏమిట్రా?'' - అడిగింది పార్వతమ్మ.

''వణ్ణంలోకి ఏదైనా పచ్చడివుంటే పెట్టండమ్మా!''

''అలాగే! కూచో.... వస్తాను!'' - వంటింట్లోకి వెళ్లి - రెండు నిమిషాల్లో తిరిగి వచ్చింది.... చిన్న ఆకుముక్కలో పచ్చడీ, గాజుగిన్నెతో పులుసూ తెచ్చి వాడి చేతికిచ్చింది.

ఆశగా వాటివైపు చూసి, ఉత్సాహంగా అన్నాడు కిష్టిగాడు-

''గోంగూర పచ్చడా అమ్మగోరూ?.... ఇదంటే మాయమ్మకి ఎంతో ఇష్టం.... దీన్ని ఇంటి కట్టుకుపోతాన్లెండి!''

వాడి మాటలు వింటూంటే శివరామయ్యకి ఎంతో ముచ్చట వేసింది. కొడుకంటే అలా వుండాలి!....

''కిష్టిగాడికి తల్లిపట్ల ఎంత ప్రేమా?'' అనుకున్నాడు.

వాడికి మహావుంటే పన్నెండేళ్ళుంటాయి!

ఎదురుగా రోడ్డుకి అవతలపక్కన - నిద్రగన్నేరు చెట్టుకింద చిన్న గోనె పట్టామీద కూర్చుంటాడు.... పక్కనే విరిగిపోయిన చెక్కపెట్టె.... అందులో రకరకాల తోలుముక్కలు... మరోపక్కన పాలిష్ డబ్బాలూ బ్రష్షులూ.... పాతజోళ్ళు! చెప్పులు కుట్టడం వాడివృత్తి... మరీ చిన్న వయసు కావడం చేత వాడి పనితనం మీద చాలామందికి నమ్మకం తక్కువ... అందుకే వాడికి ఎక్కువ పని వుండదు... ఎప్పుడు చూసినా, చిరిగిపోయి దారాలు వ్రేలాడుతూండే కాకీనిక్కరు తోటీ 'అసలు రంగు' ఏమిటో కూడా తెలియనంతగా మాసిపోయిన బనీనుతోటీ కనిపిస్తాడు... ఒక్కటే కన్ను!..... రెండో కన్ను ఎందుకు పోయిందో తెలీదు.... నెలల తరబడి తలకు నూనె రాసుకోకపోవటం వల్ల బిరుసెక్కిపోయి దుమ్ము కొట్టుకుపోయిన జుట్టుతో - పేరు తెలియని మృగంలా కనిపిస్తాడు.

అయినా వాడిముఖంలో ఏదో ఆకర్షణ వుంది.... వాడిలో ఏదో విచిత్రమైన అందం వుంది... ఆ ఆకర్షణా, అందాలే వాడిపట్ల మమకారాన్ని కలిగిస్తాయి.

వసారాగుమ్మంలో, వాలుకుర్చీలో కూర్చుని ఎదురుగా చూస్తే వాడు కనిపిస్తూంటాడు. శివరామయ్యకి... అసలు... ఆ కుర్చీలో కూర్చోగానే వాడి కోసం ఆయన కళ్లు వెతుకుతాయి. రెప్పార్పకుండా వాడినే గమనించాలనిపిస్తుంది... వాడిచేష్టలు చూస్తుంటే ఒకోసారి ఆయనకు నవ్వువస్తుంది.... మరోసారి జాలివేస్తుంది... చాలాసార్లు కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి...

పొద్దున్న ఎనిమిదయ్యేసరికి వాడు ఆ చెట్టుకిందకు వస్తాడు. మళ్ళీ చీకటి పడేవరకూ అక్కడే వాడి బతుకు! చిన్న సిల్వరు డబ్బాతో యింటి దగ్గర నించి అన్నం తెచ్చుకుంటాడు... అదే రోజంతా వాడి ఆకలి తీరుస్తుంది.

వాడికంటే వయసులో చిన్నపిల్లలు యూనిఫారం వేసుకుని పుస్తకాలు చేత పట్టుకుని వెడుతూంటే - ఆ పిల్లలవైపు అలాగే అమాయకంగా చూస్తుండిపోతాడు.... వాళ్ళల్లో ఎవరిపైనా బూట్లు రంగుపోయి వెలిసి నట్టుగా కనిపిస్తే - వాళ్ళను పిలుస్తాడు... డబ్బులు లేవంటున్నా సరే వినకుండా - ఆ బూట్లు తీసుకుని పాలిష్ చేసి ఇస్తాడు... వాడికి అదో సరదా!

పనేమీ లేనప్పుడు - పక్కనున్న చెక్కపెట్టె మీద దరువు కొడుతూ ఈల పాటలు పాడతాడు ... సైకిళ్ళమీద ఎవరైనా కుర్రాళ్లు వెడుతుంటే - వాళ్ళని పని గట్టుకుని పలుకరిస్తాడు.

చాలాకాలంగా వాడు అక్కడే వుంటున్నా - శివరామయ్య అంతగా గమనించలేదు. కానీ రెండేళ్ళ క్రితం ఊరి చివర ఏరు పొంగినప్పుడు - అప్పుడే వాడిపట్ల ఆసక్తి పెరిగింది ఆయనకి.

అవును!

సరిగ్గా రెండేళ్ళ క్రితం!......

అప్పటికి రెండ్రోజుల్నించీ ఏకధాటిగా కురుస్తోంది వర్షం... పల్లపు ప్రాంతాలన్నీ మోకాటిలోతు నీళ్ళలో మునిగిపోయాయి. 'అస్సాంలో వరదలు' బొంబాయిలో భారీవర్షాలు' ..... 'బంగాళా ఖాతంలో వాయుగుండం' - అవే రేడియోలో విశేషాలు!.....

వెర్రెత్తిన ఆడది నడిరోడ్డున వీరంగం చేసినట్టు - ధారాపాతంగా అడ్డూ - అదుపు లేనట్లుగా కురుస్తోంది వర్షం... ఈదురుగాలికి, పూనకం వచ్చిన మనిషిలా చెట్ల కొమ్మలు ఊగిపోతున్నాయి... ఉత్తర దిక్కున మేఘాల్లోంచి మెరుపుతీగలు, భూమ్యాకాశాల మధ్య దూరాన్ని కొలుస్తున్నాయి... ప్రకృతిని సవాలుచేస్తూ ఉరుముల్తో పిలుస్తున్నాయి....

సరిగ్గా ఆ సమయంలోనే - తలుపు చప్పుడైంది....

'ఇంతవర్షంలో ఎవరై వుంటారబ్బా?' అనుకుంటూ వెళ్ళి తలుపు తీశాడు శివరామయ్య. ఎదురుగా పదేళ్ళ కుర్రాడు.... వాడిపక్కనే గోనెపట్టా కప్పుకున్న ఓ నడివయసు ఆడది.

వాళ్ళిద్దరూ వర్షంలో పూర్తిగా తడిసిపోయారు. పైగా చలిగాలికి వణికిపోతున్నారు.

''నేనుబాబూ... కిష్టిగాణ్ణి... ఈ రోడ్డవతల చెప్పులు కుడుతూంటాను!'' పరిచయం చేసుకున్నాడు.

'ఏం కావాలీ!' అని అడుగుదామనుకున్నాడు శివరామయ్య.... అంతలో వాడే చెప్పాడు మళ్ళీ.

''ఏరుపొంగింది బాబూ..... మా గుడిసె కొట్టుకుపోయింది. ఈ రాత్రికి తమరింట్లో, ఈ మూల కాస్త చోటిస్తే....!'' భయం భయంగానే అడిగాడు.

శివరామయ్య క్షణం పాటు తటపటాయించాడు.

''మా యమ్మకి సుస్తీ బాబూ.... అందుకుని దాని ఒక్కదానికి కూసింత సోటివ్వండి సాలు! నేను ఇక్కడే ఈ అరుగు పక్కన కూసుంటాను.... తెల్లారినంక ఎల్పోతాం బాబూ.... మీకు పున్నెం వుంటుంది... మా యమ్మకి సుస్తీ!'' - ప్రాధేయపూర్వకంగా అడిగాడు వాడు.

తల్లిపట్ల వాడికి గల అభిమానం గమనించేసరికి శివరాయమ్యలో పరవశం కలిగింది. అప్పటికే అమెరికా వెళ్లిపోయిన తన కొడుకు సుందరం, ఆ పదేళ్ళ కిష్టిగాడి కళ్ళల్లో కనిపిస్తాడేమోనని ఆశగా వెతికి చూశాడు.

అదిగో....!

అప్పట్నించే వాడిపట్ల శివరామయ్యలో ఆసక్తి పెరిగింది... అప్పుడప్పుడు వాడికి పనిలేనప్పుడు, ఇంటికి పిలిచి వాడితో కబుర్లు చెప్పేవాడు. తాను టిఫెన్ తింటూ వాడిక్కూడా పెట్టేవాడు. అలాంటప్పుడు కూడా శివరాయమ్యకి సుందరం మనసున మెదిలేవాడు.

## తల్లిదండ్రుల వ్యథకు అక్షర రూపం



ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు కథలు రావటం ప్రారంభమైన రోజుల్లో రాసిన కథ ఈ గోదానం!... చిన్న ఉద్యోగం, మధ్యతరగతి జీవనం..... వీటి మధ్య చిన్న చిన్న కోరికల్ని కూడా పిల్లల కోసం త్యాగం చేసే తల్లితండ్రులు ఈ కథలో కనిపిస్తారు...పెద్ద చదువులు చదివి... ఉన్నత వుద్యోగాల కోసం పిల్లలు విదేశాలకు ఎగిరిపోతే-వృద్ధాప్యంలో తమను చూసుకునేవారూ, ఆప్యాయతల్ని పంచేవారూ లేక, తల్లడిల్లిపోయే ఆ తల్లితండ్రులకు ఏ పిల్లవాడు ఆసరాగా కనిపించినా-వాడిలోనే తమ పిల్లల్ని చూసుకుంటారని ఈ కథలో చెప్పటానికి ప్రయత్నించాను...

1985 నాటి ఈ కథ గురించి ఇప్పటికీ సాహితీ మిత్రులు గుర్తు చేస్తూంటారు.... ఈ కథ నాటికగా రూపొందించి పరిషత్తుల్లో ప్రదర్శించడం జరిగింది.

*- జీడిగుంట రామచంద్రమూర్తి*

*ఫోన్ 9849028516*

తాము తినగా మిగిలిపోయిన కూరలూ, పచ్చళ్ళూ – వాడికి పెట్టేది పార్వతమ్మ. క్రమేపీ ఎవరూ చెప్పకుండానే – ఆ ఇంట్లో ఆ పనీ ఈ పనీ చేయటం ప్రారంభించాడు కిష్టిగాడు. నూతిలో నీళ్ళు తోడటం, పెరట్లో అరటిచెట్లకి నీళ్ళు పోయటం – ఉత్తరాలు పోస్టులో వేయటం – ఇలాంటివన్నీవాడు చేయవలసిందే!

''వాడికి ఓ రెండు రూపాయలిచ్చి – శుభ్రంగా క్షవరం చేయించుకు రమ్మని చెప్పండి!... మీకు పుణ్యం వుంటుంది... ఆ చింపిరి జుట్టు చూళ్ళేక పోతున్నాం'' – పులుసూ పచ్చడీ తీసుకుని రోడ్డు దాటుతున్న కిష్టిగాడి వైపు చూస్తూ అంది పార్వతమ్మ.

అంతవరకూ వాడి గురించే ఆలోచిస్తున్న శివరామయ్య – ఊహల్లోంచి బయటపడి – పార్వతమ్మకు చెప్పాడు.

''క్షవరానికి డబ్బుల్లేక మానేశాడనుకుంటున్నావా?.... వాడు రోజూ మన దగ్గరే డబ్బులు దాచుకుంటున్నాడు... మర్చిపోయావేమో?''

''అవును కదూ?... ఇప్పటికి మొత్తం ఎంతయిందేమిటీ?''

''రెండు వందల డెబ్బయి దాటింది... మూడు వందలు పూర్తయ్యాక తిరుపతి వెడతాడట... వాళ్ళమ్మకి జబ్బు తగ్గిపోయి మళ్ళీ లేచి తిరిగితే – తిరుపతిలో జుట్టు ఇస్తానని వెంకన్నకి మొక్కుకున్నాట్ట!''

''వెధవకి అమ్మంటే ప్రాణం...! ఇంతకీ వాళ్ళమ్మకి తగ్గిందటా?''

''ఏమో!.... అసలు జబ్బేమిటో తెలిస్తేగా... నిన్ననో మొన్ననో ఆస్పత్రికి తీసుకు వెళ్ళాడట.... వాడే చెప్పాడు''.

''పోనీ ఆ తక్కిన డబ్బేదో మీరు వేసి ఇచ్చేయరాదూ?.... ఆ మొక్కు కాస్తా తీర్చుకొస్తే వాళ్ళమ్మ జబ్బు తగ్గుతుందేమో?'' సలహా ఇచ్చింది పార్వతమ్మ.

''అదీ అయింది!... నేను ఇస్తానంటే ససేమీరా వీల్లేదన్నాడు... వాడి కష్టార్జితంతోనే వెళ్ళాలట!'' చెప్పాడు శివరామయ్య.

''పుట్టుక, తక్కువ కులంలో అయినా వాడి బుద్ధులు మాత్రం మా గొప్పవి!.... కదూ?'' అడిగింది క్షణం తర్వాత.

కానీ శివరామయ్య ఆ మాటలు వినిపించుకోలేదు.... కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్నాడు... ఆ ఆలోచనల కళ్ళముందు సుందరమే కనిపిస్తున్నాడు.


***

ఫిబ్రవరి పద మూడో తేదీ..... అర్ధరాత్రి పన్నెండు గంటలవేళ...!

ఏదో అలికిడి అయితే, కళ్ళుతెరిచి చూశాడు శివరామయ్య.... ఎవరో ఇద్దరు మనుషులు లోపలకు వస్తున్నారు. వాళ్ళచేతుల్లో నల్లటి తాళ్ళున్నాయి. విరబోసుకున్నట్టుగా జుట్టు... ఎర్రటి అగ్నిగోళల్లా కళ్ళు!.... నల్లగా, లావుగా వికృతంగా కనిపిస్తున్నారు.

అటూఇటూ చూస్తూ – వాళ్లు నెమ్మదిగా పార్వతమ్మ దగ్గరకు వచ్చారు.... ఆమె చేతుల్నీ, కాళ్ళనీ – నల్లతాళ్లతో కట్టేశారు... ఇద్దరూ ఏదో మాట్లాడుకున్నారు. వాళ్ళ భాష ఏమిటో శివరామయ్యకి అర్థం కావటం లేదు... అయోమయంగా చూస్తున్నాడు.

ఈలోగా వాళ్ళిద్దరూ పార్వతమ్మను భుజాల మీదకు ఎత్తుకున్నారు. శివరామయ్యకు పరిస్థితి అర్థమవుతోంది.



తన భార్యను.... తన పార్వతిని యమభటులు తీసుకుపోతున్నారని గ్రహించాడు.... ఎలాగో బల వంతాన గొంతు పెగల్చుకుని 'పార్వతీ' అని అరిచాడు.

అంతే!.....

శివరామయ్యకి కల చెదిరిపోయి మెలకువ వచ్చేసింది. ఒక్క ఉదుటన లేచి కూర్చున్నాడు.... ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. భయంగా పక్కకు చూశాడు. మంచం మీద పార్వతమ్మ కనిపించింది.

''హమ్మయ్య!'' తేలిగ్గా నిట్టూర్చి టీపాయ్ మీద వున్న రాగి చెంబులోని మంచినీళ్ళ తాగేడు.... మళ్ళీ పడుకోబోతూ అప్రయత్నంగా భార్యవైపు చూశాడు.

అలా చూసిన శివరామయ్య గుండె ఝల్లు మంది!

పార్వతమ్మ నిద్రపోవటం లేదు. కళ్లు తెరచి దీనంగా భర్తవైపే చూస్తోంది. శ్వాస పీల్చుకోటానికి ఎంతో ప్రయాస పడుతోంది. మాట్లాడటం చేత కానట్టుగా మంచినీళ్ళు కావాలని చేత్తోనే సంజ్ఞ చేస్తోంది.

గబగబా ఆమెకు మంచినీళ్ళు అందించాడు.

కానీ...

ఆ నీళ్ళు ఆమె గొంతు దిగటం కష్టమైంది.... అప్పటికే ఆమె ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి... ఆశ చావక శివరామయ్య డాక్టర్ని తీసుకొచ్చినా చనిపోయిన పార్వతమ్మ బ్రతికి రాలేదు.

తెల్లవారే వరకూ 'షాక్' నించి తేరుకోలేకపోయాడు శివరాయమ్య. తేరుకున్న తరువాత దుఖాన్ని ఆపులేక పోయాడు.

చుట్టుపక్కల వారంతా వచ్చారు. ఆ వయసులో శివరామయ్యకి వచ్చిన కష్టానికి జాలిపడ్డారు. ఎవరో పెద్దమనిషి సుందరం ఫోన్ నెంబరు తీసుకుని ఎస్.టి.డి. బూత్‌కి వెళ్ళాడు.

నలభై ఏళ్లు తనకు తోడుగా, నీడగా వుంటూ వచ్చిన భార్య హఠాత్తుగా మరణించిందనే బాధ కంటే - చివరిసారిగా సుందరాన్ని చూడాలన్న ఆమె కోరిక తీరలేదనే బాధ ఎక్కువైంది శివరామయ్యకి.

అసలు ఆమెకు సుస్తీ చేసి మంచం ఎక్కివుంటే - కొడుకుని అర్జంటుగా రమ్మని ఫోన్ చేసేవాడే! .... కానీ ఊహించకుండా అంతా జరిగి పోయింది....!

నిజమే...!

మరుక్షణంలో ఎదురయ్యే విపత్తు ఎలా ఉంటుందో మనిషి ఊహించ లేడు కదా!..... సూర్య చంద్రులు ప్రకృతికి కాపలా వున్నట్లే - ప్రాణమూ మృత్యువూ మనిషికి కాపుకాస్తుంటాయి.... వెన్నెల చల్లదనంలో ప్రాణానికిహాయి కలిగినట్లు మృత్యువు కౌగిట్లో మనిషికి సేద తీరుతుంది!.... గూటిలోని రామచిలకలా లోలోపల ఎక్కడో ప్రాణం పదిలంగా వుంటే, భయపెట్టే రాక్షసిలా మృత్యువు వెన్నంటి వెనుకనే వుంటుంది!.... పంజరంలోంచి ప్రాణం ఎగిరిపోగానే - పొంచివున్న మృత్యువు మనిషిని ఆబగా ఆక్రమించుకుంటుంది. ఎన్నోఏళ్ళకు సరిపడే ఆశల్ని గుండెల్లో పెంచుకునే మనిషి, మరుక్షణం ఏం జరుగుతుందో ఎందుకు తెలుసుకోలేక పోతున్నాడో?......

భార్యా వియోగం వల్ల కలిగిన బాధలోంచి శివ రామయ్య ఆలోచనలు ఆ రకమైన వేదాంతం వైపూ - వైరాగ్యం వైపూ పరుగులు తీస్తున్నాయి.

కొడుకు రాక కోసం ఎదురుచూస్తూ - ఆ రోజంతా పార్వతమ్మ భౌతిక దేహాన్ని అలాగే వుంచవలసి వచ్చింది. మర్నాడు బారెడు పొద్దెక్కినా, సుందరం వచ్చే జాడ కనిపించకపోయే సరికి - బంధుమిత్రుల ఒత్తిడి వల్ల శివరాయమ్య, భార్య భౌతిక కాయానికి దహన సంస్కారాలు పూర్తి చేశాడు.

ఆ పదిరోజులూ, తన పని వదిలేసి - ఆ ఇంట్లోనే ఉండిపోవాల్సి వచ్చింది కిష్టిగాడికి... చిన్న చిన్న సరుకులు ఏవైనా అవసరం వస్తే బజారుకి పరుగెత్తి వాటిని తీసుకురావటం - వచ్చిన బంధుమిత్రు లందరికి స్నానాలు ఏర్పాట్లు చూడటం వంటి పనుల్తో క్షణం తీరిక లేకుండా కనిపించే వాడు.

అప్పుడప్పుడు శివరాయమ్య ఒక్కడూ తన గదిలో కూర్చుని కన్నీరు పెట్టుకోవటం కనిపిస్తే - వాడి లేత మనసు అల్లాడిపోయేది... వెంటనే ఆయన దగ్గరకు వెళ్ళేవాడు...

''ఏడవకండి బాబూ!.... పైనున్న అమ్మ గోరు బాధపడతారు!!'' అనే వాడు.

ఆ మాటకు శివరామయ్య మనసులోని ఆవేదనంతా మటుమాయమై పోయేది... మళ్ళీ మరుక్షణంలో - తన కొడుకునించి అలాంటి ఓదార్పు ఇంకా దొరకలేదనే ఆలోచన వచ్చి మరింత దిగులు పడేవాడు.

శివరామయ్యకి అంతధైర్యం చెప్పినా - వెంటనే పెరట్లో నూతిపక్కకు వెళ్ళి కరువుతీరా ఏడ్చేవాడు కిష్టిగాడు....

***

ఫిబ్రవరి పదిహేడో తేది... ఉదయం ఎనిమిది గంటల వేళ!

పెరట్లోకి వచ్చిన కిష్టిగాడు - నూతి పక్కన రాటకు కట్టివున్న ఆవునీ, దాని పక్కనే వున్న లేగదూడనీ చూసి ఆశ్చర్యపోయాడు.

''ఆయగోరు ఆవుని కొన్నారా?'' అని అడిగాడు పక్కనే వున్న పని మనిషిని.


''అవును! నిన్నరాత్రే తోలుకొచ్చారు పక్కవూర్నించి!'' చెప్పింది. పనిమనిషి

''బలే బావుంది!... రోజూ ఆవుకి పాలు తీయచ్చు ఎంచక్కా!'' అన్నాడు కిష్టిగాడు దాని తల నిమురుతూ.

''అది ఇంట్లో ఉండేది కాదురా!.... నాలుగయిదు రోజుల్లో దాన్ని బాపనయ్యకి దానం ఇచ్చేస్తారు!!''

''దానమా?.... ఎందుకూ?-

''ఎందుకేట్రా ఎర్రిమొగమా?.... అమ్మ గోరు పోయారుగా... అందుకనీ ఆరిపేరు మీద గోవుని దానం సేత్తో బోలెడెంత పున్నెం వస్తాది అమ్మ గోరికి!.... ఆర



వ్పుడు తిన్నగా సొర్గానికే ఎల్లిపోతారు!'' చెప్పింది పని మనిషి.

ఏదో అర్థం చేసుకునేటందుకు ప్రయత్నిస్తూ - అలాగే ఆలోచిస్తూ ఉండి పోయాడు కిష్టిగాడు....

***

ఫిబ్రవరి ఇరవై ఏడో తేదీ....

రాత్రి తొమ్మిది గంటల వేళ...!

హ్యూస్టన్ నగరపు 'డౌన్ టౌన్' సమీపంలో వున్న ఆ బంగళా ముందు 'డాట్సన్' కారొచ్చి ఆగింది.

కార్లోంచి దిగిన సుందరం గుమ్మం దగ్గరకొచ్చి బజర్ నొక్కాడు.

రమ్య తలుపు తీసింది...

''పీలూ ఎక్కడ?'' బట్టలు మార్చుకుంటూ అడిగాడు.

''పక్కవాళ్ళ బేబీ, వీడియోలో 'సూపర్‌మాన్' చూద్దాం రమ్మంటే వెళ్లింది!''

''ఎనీ లెటర్స్?''

''మీ నాన్నగారు రాశారు!'' కవరు తెచ్చి భర్తకు అందించింది.

దాన్ని పక్కనే వున్న టీపాయ్ మీద పెట్టి - హేంగర్‌ని తగిలించి వున్న నైట్ గౌన్ తీసి తొడుక్కున్నాడు సుందరం. బాత్‌రూంలోకి వెళ్ళి ముఖం కడుక్కొని వచ్చాడు.

ఈలోగా డిన్నర్ రెడీ అయింది....

డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాక తండ్రి రాసిన వుత్తరం తీసి చదువుకున్నాడు.

''ఏం రాశారు?'' అడిగింది రమ్య.

''అమ్మ పోయిందని ఫోన్ చేసి చెప్పినా - నేను వెళ్ళనందుకు - ఆయన మాట ఎలావున్నా - ఊళ్ళో నలుగురూ నాలుగు రకాలుగా అనుకున్నారట!''

''నిజమే మరి! కన్నతల్లి పోయినా మీకు బాధ లేకపోయింది!'' నిష్టూరంగా అంది రమ్య.

''బాధపడి మాత్రం ఏం చేయగలం చెప్పు?.... అసలు 'డెడ్ బాడీ' వుండ గానే వెళ్ళి వుండాల్సింది... నేనేమో షికాగో కాన్ఫరెన్సులో బిజీగా వుండీ వీలుపడలేదు... ఇక ఇప్పుడు వెళ్ళినా ఒకటే, వెళ్ళకపోయినా ఒకటే!'' వైద్యవృత్తి తెచ్చిపెట్టిన మొండితనమో, లేక ఎన్నో మరణాల్ని కళ్ళముందు చూసిన అనుభవమో సుందరం చేత ఆ మాటలనిపించింది.

''అత్తయ్యగారు లేనిలోటు అందరికంటే ఆయన్నే ఎక్కువ బాధిస్తుందండీ!.... ఈ సమయంలో మావయ్యగారికి ధైర్యం చెప్పవలసింది మీరే కదా!'' బాధ్యతను గుర్తుచేసింది రమ్య.

''నాన్నకి ధైర్యం చెబుతూ ఉత్తరం రాశానుగా! అమ్మపేరు మీదుగా ఏదైనా ఓ సత్కార్యం చేయమని పాతికవేలు పంపించాను. మనకి మరో బేబీ పుడితే అమ్మపేరు పెట్టుకోవాలని కూడా డిసైడ్ చేసుకున్నాను. ఇంత కంటే నేనేం చేయగలను చెప్పు?''... నిస్సహాయంగా అడిగాడు సుందరం.

అతని వైపు వింతగా చూస్తుండిపోయింది రమ్య.

***

మార్చి పదో తేదీ.... ఉదయం పది గంటల వేళ...!

ఏలూరు పవర్‌పేటలో - పార్వతీభవనం - చైతన్యరహితంగా కళా విహీనంగా మూర్తీభవించిన శోకదేవతలా కనిపిస్తోంది.

వసారా గుమ్మంలో వాలుకుర్చీలో పడుకుని - వీధి వైపే చూస్తున్నాడు శివరామయ్య.

పోస్ట్‌మేన్ వెళ్ళిపోయాడు.

'ఈరోజు కూడా సుందరం దగ్గర్నించి ఉత్తరం రాలేదు' అనుకున్నాడు.

ఇదివరకైతే - తన బాధల్నీ ఆలోచనల్నీ భార్యకు చెప్పుకునే అవకాశం వుండేది. ఆవిడపోయిన తర్వాత ఎక్కువగా తనలో తనేకొంచెం గట్టిగానే మాట్లాడుకోవటం అలవాటు చేసుకున్నాడు శివరామయ్య.

రోడ్డుకి అవతల నిద్రగన్నేరు చెట్టు దగ్గరకు దృష్టిని సారించాడు. అక్కడ ఖాళీగా వుంది - తన మనసులా...!

'కిష్టిగాడు ఎందుకు రావటం లేదో' అనుకున్నాడు కళ్లు మూసుకుని.

భార్యపోయిన తర్వాత దాదాపు పదిహేను రోజులు తనతోటే తనింట్లో, వాడూ ఒకడిగా తిరిగాడు. తనకు బాగా దగ్గరయ్యాడు... అందుకే ఈ మధ్య వాడు కనిపించక పోయేసరికి ఆలోటు కొట్ట వచ్చినట్టు కనిపిస్తోంది.

'ఎక్కడికి వెళ్లాడో? ఇక మిగిలిపోయిన కూరలూ పచ్చళ్ళూ ఇచ్చి, పలకరించే దిక్కు ఈ ఇంట్లో లేదనుకని దుకాణం మరోచోట పెట్టుకున్నాడేమో?' అనుకుంటున్నాడు మళ్లీ....

సరిగ్గా అప్పుడే - అలా అనుకుంటున్నప్పుడు-

''నాన్నగారూ'' అన్న పిలుపు వినిపించినట్లయింది.

ఆ పిలుపుతో మనసు పులకరించినట్లయి మగతగా మూసుకుపోతున్న కళ్ళను బరువుగా విప్పి చూశాడు శివరామయ్య.

ఎదురుగా కనిపించింది సుందరం కాదు... కిష్టిగాడు!

అప్పుడనిపించింది వాడు పిలిచింది 'నాన్నగారూ' అని కాదు - 'బాబూగారూ' అని...!

''ఏరా... వచ్చావా?'' అన్నాడు భ్రమలోంచి తేరుకుంటూ.

అంతలోనే వాడు గుండు చేయించుకుని వున్న విషయాన్ని గమనించి అడిగాడు వెంటనే-

''ఇన్నాళ్ళూ కనిపించకపోయే సరికి ఏమైపోయావో అనుకున్నాను. తిరుపతి వెళ్లి వచ్చావన్న మాట.... మంచి పని చేశావ్... ఆ చింపిరి జుట్టు తీయించేసి గుండు చేయించుకుంటే ఎంత బావున్నావో తెలుసా??... అమ్మగారు బ్రతికుంటే నీకు దిష్టి తీసేదిరా బడుద్దాయ్... అవునూ! తిరుపతి ప్రయాణానికి నా దగ్గర డబ్బు దాచుకున్నావుగా! మరి తీసుకెళ్లలేదే?''

''వాటికోసమే వచ్చాను బాబూ.... ఆ డబ్బుతో ఓ ఆవుని కొని నేను కూడా గోదానం చెయ్యాలి!''

ఆ మాట విన్న శివరామయ్య త్రుళ్ళి పడ్డాడు.

హఠాత్తుగా కుర్చీలోంచి లేచి - కిష్టిగాడి దగ్గరగా వచ్చాడు.

''ఏమిట్రా?.... ఏమిటి నువ్వంటున్నది? అంటే...''

''మా అమ్మ చచ్చిపోయింది బాబూ''

కిష్టిగాడు ఏడుస్తున్న సూచనగా ఎక్కిళ్లు వస్తున్నాయి.

మరింత దగ్గరగా వచ్చి - వాడి భుజం మీద చేయివేసి - మరో చేత్తో వాడి తలను పైకెత్తి - కళ్ళల్లోకి చూశాడు శివరామయ్య.

ఆ కళ్ళల్లో కన్నీరు కోటి సముద్రాలై సుడులు తిరుగుతోంది.

అంతే!....

ఒక్కసారిగా వాణ్ణి తన దగ్గరగా లాక్కుని గట్టిగా కౌగిలించుకున్నాడు.ఆ గాఢ పరిష్వంగంలో వున్నది - కిష్టిగాడు కాక - సుందరమేనేమో - అన్న అనుభూతికి క్షణం సేపు లోనయ్యాడు శివరామయ్య!!

*

*(ఆంధ్రభూమి....1985)*

